క్లుప్తంగా

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి



అంబాజీపేట: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని అంబాజీపేట బస్‌స్టేషన్ సమీపాన ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శాకంబరిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులు, భక్తులు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని కనులవిందుగా అలంకరించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని లలితా పారాయణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

టీచ్ టూల్ అబ్జర్వేషన్ శిక్షణలో బోధన సిబ్బంది

సఖినేటిపల్లి: అమలాపురం పరిధిలోని పేరూరు హైస్కూల్ నందు 9 రోజుల పాటు జరిగిన టీచ్ టూల్ అబ్జర్వేషన్ శిక్షణలో మండలానికి చెందిన 22 మంది ఉపాధ్యాయులు, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు పాల్గొన్నారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు కోలా వీరాస్వామి, సత్యనారాయణ, సుగుణ, శ్రీనివాస్, శ్రీధర్ కృష్ణ శనివారం వివరించారు. టీచ్ టూల్ యాప్ ద్వారా తరగతి గది పరిశీలన, మోడల్ టీచింగ్, తరగతి గదుల్లో టీచర్లు ఎట్లా ఉంటున్నారు, బోధన ఎలా జరుగుతోంది అన్నది తెలుస్తుందన్నారు. జిల్లా మాస్టర్ శిక్షకులు ఎస్.సుధాకర్, జి.నాగేశ్వరరావు తమకు 9 రోజుల పాటు శిక్షణ ఇచ్చారన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాటితో ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌వీబీడీసీపీ సబ్ యూనిట్ అధికారి ఎన్‌వీ రామారావు, సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. వాకలగరువు ఫిషర్‌మ్యాన్‌పేటలో డెంగీ, స్టాప్ డయేరియా, లెప్రసీ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లెప్రసీ, డయేరియా, డెంగీ వ్యాధులపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, హెల్త్ అసిస్టెంట్ జె.ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

ఆలమూరు: మండలంలోని మడికిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శనివారం స్టూడెంట్ కిట్స్ పంపిణీ జరిగింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు సమకూర్చిన విధంగా ఐదు రకాల వస్తువులతో కూడిన కిట్లను ఆయా పాఠశాలల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, టీడీపీ నేతలు అందజేశారు. ఈ స్టూడెంట్ కిట్‌లో నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బెల్ట్, సాక్సులు, పుస్తకాల బ్యాగ్‌తో కూడిన స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకుని చక్కని విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృంద సభ్యులు విజ్ఞప్తి చేశారు.

అన్యమత ప్రచార పోస్టర్ ఏర్పాటుపై ఫిర్యాదు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానానికి సంబంధించిన ఆలయ మార్గం సూచిక బోర్డుపై అన్యమత ప్రచార పోస్టర్ ఏర్పాటుపై సఖినేటిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ శనివారం చెప్పారు. అంతర్వేది దేవస్థానం గ్రామంలో ఆలయానికి వెళ్లే మార్గంలో భక్తుల సౌకర్యార్థం సూచిక బోర్డు గతంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ బోర్డుపై అపరిచిత వ్యక్తులు ఏర్పాటు చేసిన అన్యమత ప్రచార పోస్టర్‌ను గుర్తించిన వెంటనే ఆలయ సిబ్బందితో తొలగించామన్నారు. తిరిగి బోర్డుపై నూతన ఆలయ పోస్టర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కాగా ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సఖినేటిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన చెప్పారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ-ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,42,940, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.39,920తో మొత్తం రూ.1,82,840 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

మలికిపురం: ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విభాగం పర్యావరణ పరిరక్షణ కోసం విశ్వేశ్వరపురంలో జెడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులు, కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ కలసి పర్యావరణ పరిరక్షణ ర్యాలీని నిర్వహించారు. వీధుల్లో దోమలను నివారించాలని, మొక్కలు నాటాలని, పరిసరాల శుభ్రంగా ఉంచాలని, నినాదాలతో గ్రామ గ్రామాన ప్రచారం చేశారు.

తగ్గినట్టే తగ్గి.. మళ్లీ పెరిగి

- తీరని లంక ప్రజల అవస్థలు
- నానుతున్న పంటలు, ఇళ్లు

మామిడికుదురు: తగ్గుతుందనుకుంటున్న తరుణంలోనే గోదావరి వరద తీర గ్రామాలను మళ్లీ చుట్టుముట్టింది. ప్రజలను తీవ్రంగా కలవరపెడుతోంది. ముప్పు తప్పిందని ఆనంద పడుతున్న లంక గ్రామాల ప్రజల నెత్తిన పిడుగు పడింది. పెరుగుతున్న వరదతో అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పెదపట్నం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక మత్స్యకార ప్రాంతాల ప్రజలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన ఉచ్చులవారిపేట పంచాయతీరాజ్ రోడ్డుపై వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో వరద నీటిలోనే తీవ్ర ఇబ్బందుల నడుమ స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. పలు నివాసాలను వరద నీరు చుట్టుముట్టడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో విష సర్పాల బెడదతో బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నామని తీర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముంపుబారిన పడిన పంటలు పాడైపోతాయని కలత చెందుతున్నారు. పశుగ్రాసం లేక పశువులు అల్లాడిపోతున్నాయి. వరద మరింత పెరుగుతుందన్న కేంద్ర జల సంఘం హెచ్చరికలు తీర గ్రామాల ప్రజలను కలవర పాటుకు గురి చేస్తున్నాయి.

ఆలమూరులో..

ఆలమూరు: గత రెండు రోజులుగా నిలకడగా ఉన్న గోదావరి శనివారం పెరిగింది. దీంతో బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లోని రైతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేస్తే తమ పంట పొలాలు వరద ముంపులో మునగడం ఖాయమని ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ ఎ.మేరీరోజ్, ఎస్సై పి.శివప్రసాద్ తదితరులు మండలంలోని బడుగువానిలంకలో పర్యటించి వరద పరిస్థితిని సమీక్షించారు.



అప్పనపల్లిలో వరద నీటిలోనే బాధితుల ప్రయాణం



ఊడిమూడిలంకకు బియ్యం బస్తాల తరలింపు

నీట మునిగిన ఇళ్లు, కొబ్బరి తోటలు

అంబాజీపేట: ఎగువ ప్రాంతాల్లో వరద పోటెత్తడంతో వైనతేయ గోదావరి శనివారం ఉధృతంగా ప్రవహించి గ్రామాల్లో ఉండే కౌశికలు ఉరకలు వేస్తున్నాయి. నందంపూడి, వాకలగరువు, తొండవరం గ్రామాల్లో ఇళ్లు, కొబ్బరి, అరటి, కూరపాదులు నీట మునిగాయి. గోదావరి సమీపాన ఉన్న కౌశికలోకి వరద నీరు చేరడంతో కాలనీలు, అరటి, కొబ్బరితోటలను ముంచెత్తుతున్నాయి. నందంపూడి బొంతువారి పేటలో ఎనిమిది ఇళ్లు నీట మునిగాయి. వాకలగరువు రజకపేటకు వెళ్లే ప్రధాన రహదారి నీట మునగడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇళ్ల మధ్యకు వరద చేరి మోకాలిలోతులో ప్రవహిస్తుంది. అంబాజీపేట పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు, ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని బాధితులకు తెలిపారు.

భయాందోళనలో ప్రజలు

పి.గన్నవరం: తగ్గినట్టే తగ్గి మళ్లీ వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కోనసీమలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. గత వారం రోజులుగా వరద ఉధృతి తగ్గకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక, శివాయలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. కె.ఏనుగుపల్లి రహదారిపై మూడడుగుల ఎత్తున వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో వరదనీటిలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, పుచ్చల్లంక, చాకలిపాలెం శివారు కనకాయలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. లంక భూములన్నీ జలమయం కావడంతో పశువులకు మేత లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

5993 కుటుంబాలకు బియ్యం పంపిణీ..

కొత్తపేట డివిజన్‌లో మామిడికుదురు మండలం మినహా మిగిలిన లంక గ్రామాల్లో 5993 కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నట్టు ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ తెలిపారు. ట్రాక్టర్‌పై బూరుగులంకకు వెళ్లి ఆయన వరద బాధితులను పరామర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. అయినవిల్లి మండలంలో 4500 కుటుంబాలకు, రావులపాలెం మండలంలో 110 కుటుంబాలకు, పి.గన్నవరం మండలంలో 1383 కుటుంబాలకు 25 కిలోల వంతున బియ్యం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఆదివారం నుంచి నిత్యావసరాలు కూడా అందిస్తామన్నారు. మానేపల్లి శివారు శివాయలంక, వాడ్రేవుపల్లి శివారు చినకందాలపాలెం ప్రాంతాల్లో వరద బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నామని ఆర్డీఓ సత్యనారాయణ వివరించారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ త్రిశూలపాణి తదితరులు వరద ప్రాంతాల్లో పర్యటించారు.



అప్పనపల్లిలో ఇళ్లను చుట్టుముట్టిన వరద నీరు

శివాయలంకలో పర్యటించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ

వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర తెలిపారు. మండలంలోని మానేపల్లి శివారు శివాయలంకలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి జాసిం, సూపర్‌వైజరు ఎ.నాగరాజు, బీవీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద

అయినవిల్లి: ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. పడవలపైన లంక ప్రజలు నిత్యావసరాలు కోసం, వ్యవసాయ ఉత్పత్తులు తరలించడం కోసం రాకపోకలు సాగిస్తున్నారు. వరదతో లోతట్టు ప్రాంత ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వరద నీటితో వీరికి రోగాల భయం పట్టుకుంది. వరదలతో పల్లపు పొలాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముంపులో నానిపోయిన ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. కూరగాయ, అరటి, కోకో వంటి పంటలు ముంపులోనే ఉన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



మానేపల్లి శివాయలంకలో బాలింతతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర



బడుగువానిలంకలో అరటితోటలోకి చేరిన వరద నీరు



జొన్నాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి వరదలో చిక్కుకున్న దేవాలయాలు



జి.పెదపూడిలంక నుంచి అరటి గెలలను తరలిస్తున్న రైతు



వాకలగరువులో నీట మునిగిన దొండ, కొబ్బరితోట

వరద ముంపు గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

సఖినేటిపల్లి: మండలంలోని వరద ముంపు గ్రామాలైన టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం పర్యటించారు. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి అప్పనరామునిలంకకు కలెక్టర్ పడవలో వెళ్లి మరీ వరద పరిస్థితులను పరిశీలించారు. టేకిశెట్టిపాలెం పరిధిలోని అగ్నికుల క్షత్రియ కాలనీ, అప్పనరామునిలంక పరిధిలోని ఓఎన్జీసీ కాలనీని చూశారు. వరదలో పడవలపై రాకపోకలు సాగిస్తున్న బాధితులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ఏటిగట్టు వద్ద కొంత మంది రైతులు కలెక్టర్‌ను కలసి, ధాన్యం సొమ్ములు తమ ఖాతాలకు త్వరితగతిన జమ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి అప్పనరామునిలంక నుంచి ముంపు నీటిలో అత్యవసర వైద్యసేవలకు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని సదరు గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే లంక గ్రామాలలో 2020–21 వరదలకు గురైన ముంపు బాధితులకు భోజనాలకు, గ్రూపు నావలకు, వివిధ సౌకర్యాలకు గాను బకాయిలు ఉన్న రూ.37 లక్షలు విపత్తు నిధులు ఇంత వరకూ అధికారులు చెల్లింపులు చేయలేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై తగు పరిశీలన చేస్తామని కలెక్టర్ తెలిపారు. వెంట మండల ప్రత్యేకాధికారి సిద్ధార్థన్ వర్ధన్, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, తహసీల్దారు సీహెచ్ పెద్దిరాజు, ఏవో పీవీ నరసింహరావు, ఏపీవో నాగ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శిరీష, కార్యదర్శి గంగరాజు, రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్సై ఎస్.రాము, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, విస్సా తాతయ్య నాయుడు, తాడి సత్యనారాయణ, బర్రే శ్రీను పాల్గొన్నారు. ఇదిలా ఉండగా టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద వరద బాధితులకు ప్రభుత్వ పరంగా సమకూర్చిన ఫుడ్ ప్యాకెట్లును కలెక్టర్ పంపిణీ చేశారు.



అప్పనరామునిలంకలో వరద నీటిలో పడవపై ప్రయాణిస్తున్న కలెక్టర్



టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద బాధితులకు ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

అధికారులు తక్షణ నిర్ణయాలు తీసుకోవాలి

సఖినేటిపల్లి: వరద ముంపు గ్రామాల్లో వరద పరిస్థితులకు అనుగుణంగా అధికారుల తక్షణ చర్యలు తీసుకుని బాధితులను ఆదుకోవాల్సి ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి లాకుపేటల్లో ఆయన పడవపై ప్రయాణించి బాధితులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, అప్పనరామునిలంకలో ముంపు ఏరియాలలో సుమారు వంద కుటుంబాలు వరద నీటితో అవస్థలు పడుతున్నారన్నారు. ఆయా గ్రూపులకు పూర్తి స్థాయిలో మంచి నీరు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో వేట విరామానికి పరిహారం రూ.4 వేలు చొప్పున నగదు ఇచ్చేవారని, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచి మే 15 నాటికి డీబీటీ ద్వారా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేది అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని రెట్టింపు చేస్తూ రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిందని, గద్దెనెక్కి 50 రోజులు పూర్తయినప్పటికీ రూ.20 కూడా వారి ఖాతాలకు జమ కాలేదని ధ్వజమెత్తారు. సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, నాయకులు ఈద రవిరెడ్డి, నల్లి త్రిమూర్తులు, జిల్లెళ్ల చిట్టి, కూనపరెడ్డి రాంబాబు, నల్లి రక్షణ, తాడి ఆనంద్, నల్లి గోపి, ఇంజేటి చిట్టిబాబు, గొల్లమందల వినయ్ పాల్గొన్నారు.



అప్పనరామునిలంకలో పడవపై ప్రయాణిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి

అంటువ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

ఆలమూరు: సీజనల్ దృష్ట్యా సంభవించే మలేరియా, డెంగీ, డయేరియా తదితర అంటువ్యాధి నివారణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలను చేపట్టింది. అందులో భాగంగా మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ప్రధాన వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ ఆదేశాల మేరకు వైద్యారోగ్య సిబ్బంది కార్మికులు నివసిస్తున్న ప్రాంతాలకు వెళ్లి శనివారం ప్రత్యేక వైద్యసేవలను అందించారు. ఇటుక బట్టీలు, రైసుమిల్లులు, పేపరు మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి వైద్య సిబ్బంది వెళ్లి అంటువ్యాధులు సోకకుండా తీసుకోవలసిన చర్యలపై కార్మికులకు అవగాహన కల్పించారు. మధుమేహం, రక్తపోటు, మలేరియా, రక్త నిర్ధారణ తదితర పరీక్షలు నిర్వహించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నమైతే సత్వరమే సమీప పీహెచ్‌సీని సందర్శించి రక్తపరీక్షలు చేయించుకుని మెరుగైన చికిత్సను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.



పినపళ్లలోని పేపరు మిల్లు కార్మికులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

అమ్మకు గుర్తుగా మొక్క నాటాలి

అంబాజీపేట: ప్రతి ఒక్కరికీ జీవితంలో అమ్మే ముఖ్యమని జిల్లా డీఈవో ఎం.విమలకుమారి, సమగ్ర శిక్ష ఏపీసీ ఎ.మధుసూదనరావులు పిలుపునిచ్చారు. నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో శిక్ష సప్తాహ్ 6వ రోజులో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలసి వారి తల్లులు మొక్కలను శనివారం నాటారు. హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ అమ్మ ఎలా పెంచి పెద్ద చేసిందో అదే తరహాలో నాటిన మొక్కలను కూడా సంరక్షించి అవి పెరిగే వరకు కాపాడుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. గ్లోబలైజేషన్ పేరుకుపోతున్న ప్రస్తుత సాంకేతిక యుగంలో పర్యావరణానానికి ప్రాధాన్యతను ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన పరిసరాలు కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్న తరుణంలో పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు పీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, డాక్టర్ ఎంకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ మోకా ప్రకాష్, పీడీ కె.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, బొక్కా వెంకటేశ్వరరావు, కామిశెట్టి మధుబాబు, పితాని త్రిమూర్తులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డీఈఓ కమలకుమారి, విద్యార్థులు, వారి మాతృమూర్తులు

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్రహారతి, కుంభహారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటికబెల్లం తులాభారంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు

సఖినేటిపల్లి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై శనివారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఆర్‌డీఏ ఏపీఎం విజయ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో, బేటీ పఢావో అను అంశంపైన, మహిళా చట్టాలు గురించి, బాల్య వివాహాలు గురించి వివరించారు.

అగ్నిబాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సహకారం

రాజోలు: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వంట సామగ్రి, హైజనిక్స్ కిట్స్‌ను శనివారం అందజేశారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనలతో మెరకపాలెం గ్రామానికి చెందిన శెట్టిం దాసు, కొండమ్మ, రమేష్ కుటుంబాలకు సహకారం అందజేశారు. రాజోలు నియోజవర్గ రెడ్‌క్రాస్ సమన్వయకర్త జంపన బుజ్జిరాజు ఆర్థిక సహకారంతో బియ్యం బస్తాలు అందజేశారు. సర్పంచ్ గిడుగు వెంకట నారాయణ ప్రసాద్, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం



బూరుగులంకలో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: వరద బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని బూరుగులంకలో శనివారం ఆయన వరద బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, సర్పంచ్ దంగేటి అన్నవరం, ఎంపీటీసీ పల్లి మోషే, నాయకులు తోలేటి సత్తిబాబు, సాధనాల జేడీ తదితరులు పాల్గొన్నారు.

లంక ప్రజల కాజ్‌వే కష్టాలను తీరుస్తా..

అయినవిల్లి: వరద సమయంలో ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురు బిడెం వద్ద కాజ్‌వేతో లంక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అ కష్టాలను తీరుస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరదల సమయంలో కాజ్‌వే వద్ద వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, అద్దంకివారిలంక ప్రజలు పడుతున్న కష్టాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వద్దకు తీసుకెళతానన్నారు. ఈ కష్టాలు తీరుస్తానని హామీ ఇచ్చారు. వరద బాధిత ప్రజలకు బియ్యం తదితర వస్తువులు పంపిణీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రమద్వర, వీరవల్లిపాలెం సర్పంచ్ సలాది బుచ్చిరాజు తదితరులు ఉన్నారు.

అప్పనరామునిలంకలో ఎమ్మెల్యే పర్యటన

సఖినేటిపల్లి: ఏటిగట్టుకు పూర్తిగా దిగువనున్న అప్పనరామునిలంకలో శనివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ వరద ముంపులో పడవపై వెళ్లి పర్యటించారు. వరద బాధితులను పరామర్శించి, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. వెంట ఏవో పీవీ నరసింహారావు, ఎస్సై ఎస్.రాము, నాయకులు గుండుబోగుల పెదకాపు, గెద్దం మహాలక్ష్మిప్రసాద్, కటికిరెడ్డి మహేష్, బర్రే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం

మలికిపురం: వరద బాదితులను పూర్తి స్థాయిలో ఆదుకుంటామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని వరద బాధిత గ్రామాలైన రామరాజులంక, దిండి గ్రామాలలో పర్యటించారు.



అప్పనరామునిలంకలో పడవపై పర్యటిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కొత్తపేట: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు అన్నారు. కలాం వర్ధంతి సందర్భంగా డిగ్రీ కళాశాల పొలిటికల్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ పెద్దిరాజు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని పి.గన్నవరం సీహెచ్‌సీలో అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. గర్భిణులకు, బాలింతలకు పాలు, పండ్లు పంపిణీ చేశారు.